చింతా ప్రభాకరరావు



# అంబధాల చంద్రుడు

మామిడి పళ్లున్న సంచితో యింట్లోకి అడుగు పెడ్తూ "కమలా" అని హడావిడిగా పిలిచాడు సూర్యం.

భర్త పిలుపు విని తొందరగా ఎదురు వచ్చి చేతిలో సంచి అందుకొంది కమల.

ఆ సంచిలో వున్నవి మొత్తం పన్నెండు మామిడిపళ్ళు, అవి కొనడానికని ఓ అర గంట ముందు సైకిలుపై బజారు కెళ్ళాడు సూర్యం. పళ్ళవాడు చెప్పిన రేటుకి పన్నెండు పళ్ళు కొని మళ్ళీ వెంటనే సైకిలెక్కాడు. ఆ పళ్ళు కొనడంలో అతను పడిన శ్రమ మాత్రం అంతే. అయితే ఆ మాత్రానికే పెద్ద అలసిపోయినట్టుగా ముఖం పెట్టి కుర్చీలో వుస్సురంటూ కూర్చున్నాడు. మామిడిపళ్ళను పళ్ళెంలో పేర్చుతూ అంది కమల "పళ్ళు చాలా బాగున్నాయండీ— ఎంతకు కొన్నారేమిటీ?''

"ఎంతోనా – రెండు రూపాయలు" అన్నాడతను అతి తేలిగ్గా – ఆశ్చర్యంగా చూసింది కమల. సూర్యం కాస్త కంగారుపడ్డాడు. "ఆనక తీరిగ్గా ఆరాలు తీద్దువులే గాని ముందు ఒక కప్పు కాఫీ కలుపుకొనిరా'' అన్నాడు విషయాన్ని వెంటనే మార్చి వేయాలన్న తాపత్రయంతో. చరుగున లోపలికి వెళ్ళి కాఫీ కలుపుకొని తెచ్చింది కమల. భర్త కాఫీ చప్పరిస్తుంటే విసనకర్రతో విసుర్తూ ప్రక్కన నిల్చుంది.

నిజానికా పళ్లు నాలుగు రూపాయలకు కొన్నాడు సూర్యం. ఒక్కసారిగా పళ్ళ నిమిత్తం అంత డబ్బు ఖర్చుచేయడమంటే సుతరామూ అంగీకరించదు కమల. బజార్లో ఆ పళ్లు చూడగానే ఏమైనా అవి కొని తీరాలనిపించింది సూర్యానికి. అందుకే యిప్పుడామెతో అబద్ధం చెప్పడంకంటె వేరే గత్యంతరం కన్పించలేదు.

కాఫీ చేసిన కాఫీ గ్లాసుని తీసుకువెళ్తూ నెమ్మదిగా అంది కమల. "ఇద్దరం మనుషులం యెంత చవగ్గానస్తే మాత్రం పన్నెండు పళ్లు ఒక్కసారి కొనుక్కోవడ

[illegible]
చాలవా ఏమిటి?"

అమాంతం ఎగిరి గొంతుకూర్చున్నాడు కుర్చీలో సూర్యం. ఇస్త్రీ పాంటు నలిగిపోతున్నా లెక్కచేయకుండా. "నీతో వచ్చిన పెద్ద చిక్కే ఇది! ఆ మాత్రం స్వాతంత్ర్యం కూడా నాకు లేకుండ చేద్దామనా నీ ఉద్దేశం–"

వంటింట్లోకి వెళ్తున్నదల్లా ఆగి వెనక్కి తిరిగి అంది కమల– "ఎందుకండి అంత గట్టిగా మాట్లాడతారూ. ఇప్పుడు నేనేమన్నానని - మీ పాదదాసిపై అంతటి కోపమూ చూపడం - ?"

చప్పగా చతికిలబడ్డాడు కుర్చీలో. యథా విధిగా సూర్యం గెడ్డంకింద చెయ్యి మోపి వెంటనే ఏదో ఆలోచనలో పడ్డాడు.

మూలనున్న జోళ్ళు తీసుకువచ్చి అతని పాదాల దగ్గర వుంచి కొంచెం ఎడంగా నిల్చుంది కమల.

టైం చూసుకొన్నాడు సూర్యం. ఎనిమిది కావస్తూ వుంది. భార్య మెప్పుకోలు కోసం తెచ్చిపెట్టుకొన్న విసువుతో ఆత్మే దెబ్బ తగలకుండా నెత్తినోసారి కొట్టుకున్నాడు. "ఈ శలవు రోజునైనా యిల్లనీ పెళ్లాం అని కాస్త ముచ్చటగా యింటిపట్టున పడుందామంటే ఆ మేనేజరు ముండాకొడు కూరుకోడుకదా! ఉదయాన్నే వచ్చి ఓ గంట పని జూసి వెళ్ళండి సూర్యం గారూ అంటాడు పెద్ద వాజమ్మలా ముఖం పెట్టి. ప్రతి శలవురోజునా యిదే తంతు ఏం జేస్తాం ఖర్మ–" అంటూ భార్య వింటున్నదో లేదోనని ఓసారి అటుచూసి నిశ్చింతగా వీధి గడప దాటాడు.

గుమ్మంలోపలే వుండి అడిగింది కమల "కూర్లేం వండమంటారు?"

"నీ యిష్టం."

"నా యిష్టం యింతకుముందేకదా ఖర్చయ్యింది.''

"అబ్బో" కనుబొమలెగరేశాడు సూర్యం "అయితే కొబ్బరికాయ వుందిగా

అది కొట్టి ఒక చెక్క పప్పులో వేసి రెండో చెక్క పచ్చడి చెయ్యి-

విధేయతగా తలూపింది కమల

హుషారుగా సైకిలెక్కాడు సూర్యం - మధ్యాహ్నం ఆఫీసునుంచి భోజనానికి రాగానే కాళ్ళకు నీళ్ళిచ్చి తుండుగుడ్డ అందించింది కమల. భోజనం వడ్డించి అతను తినడం ప్రారంభించిన తర్వాత ఒక మామిడి పండు తెచ్చి ముక్కలు కోస్తూ అంది. యిందాక సావిత్రి మనింటి కొచ్చిందండీ - పళ్లెంలో వున్న పళ్ళను చూసి ఎంతో ముచ్చటపడింది. పోనీ లే పాపం అని సగం వాటా యిచ్చాను. వెంటనే యింటికి వెళ్ళి రూపాయి తెచ్చి యిస్తూ మిమ్మల్నెలా పొగిడిందనుకొన్నారూ! బావగారెలాగా తెలివైనవారిక్కా అంది. మొన్న వాళ్ళాయన ఈ సైజులోనే ఆరు పళ్ళను రెండు రూపాయలక్కొని తెచ్చాడట-"

సడన్‌గా పొలమారింది సూర్యానికి — ఖంగారంతా కమల వంతే అయ్యింది.. భర్త నడినెత్తిని నెమ్మదిగా తడ్తూ కాసిన్ని మంచినీళ్ళు పట్టించి గొంతు రాస్తూ కూర్చుంది.

కాస్తంత స్తిమితపడ్డాక అడిగాడు సూర్యం "సావిత్రి నన్నలా పొగుడుతూంటే నీకేం అన్పించేది మరి"

"ఎంత ఆనంద మనిపించిందో ఏమని చెప్పనండీ! మీ గురించి ఆమె ఆడిన ప్రతి మాటా లక్ష సార్లు వినాలన్పించిందంటే నమ్మండి."

మహా తృప్తిగా భోంచేసి లేచాడు సూర్యం. అప్పటికే సావిట్లో పడక కుర్చీ వాల్చి సిద్ధంగా వుంచింది. కమల భర్త దానిపై మేను వాల్చగానే వెళ్ళి తానుకూడా భోజనానికి కూర్చుంది.

"జరిగింది సింపుల్‌గా చిన్న అబద్ధం - దానికే ధామ్మని రూపాయి నష్టం - అయితే ఏం గాక! మనప్రిస్టేజీ పొరుగింటి కూడా పాకడమే యిందులో గొప్ప విశేషం" అనుకొని కాస్త గర్వంగా నవ్వుకొన్నాడు సూర్యం - వీధిలోంచి వెంకటేశం వచ్చాడు.

స్థాయిగా పడక కుర్చీలో కూర్చుని వున్న సూర్యాన్నుద్దేశించి "గొప్పకుంపటే తెచ్చి పెట్టేవురా బాబూ నాగుండెల మీదికి" అన్నాడు.

"యిప్పుడు నీకొచ్చిన కష్టమేమిట్రా పిచ్చితండ్రీ'' అంటూ పరిహాసంగా పలకరించాడు సూర్యం అతన్ని. ప్రక్కనున్న కుర్చీలో కూర్చుంటూ వెంకటేశం అన్నాడు "ఆకల్తో వచ్చి నేను భోజనానికి కూర్చుంటే అన్నం తింటున్నంతసేపూ నా అర్ధాంగి లక్ష్మి సావిత్రి నన్నొకటే సాధింపనుకో"

"ఎందుకటా!"

"నా తెలివి తక్కువవల్ల డబ్బువృధాగా ఖర్చు చేసేస్తున్నానట, అయినా ఒరే - నాకు తెలియకడుగుతానని ఎలా కొన్నావురా బాబూ! అంతంత పెద్ద పళ్లు డజను రెండ్రూపాయలకి —"

చటుక్కున సూర్యం ముఖంలోకి "హీరో" కళ వచ్చిపడింది.

కుర్చీలో ఠీవిగా సర్దుక్కూచున్నాడు. "మరేమనుకున్నావోయ్ వెంకటేశం-నేను వీధిలోకంటూ వెళ్ళాలేగాని—వెళ్తే ఆఫ్టరాల్ ఆ పళ్ళేమిటి! కొండమీద కోతైనా దిగిరావలసిందేకదరా వెర్రినాన్నా-"

గమ్మున వెంకటేశం సూర్యం రెండు చేతుల్నీ గట్టిగా పట్టుకొన్నాడు: "ఇవి చేతులుకావు" అన్నాడు ఇంకేమీ సందేహించకుండా.

"అరె! ఇప్పుడుదాకా బాగానే ఉన్నావు గదరా! ఇంతలోనే ఏమొచ్చింది-యివి చేతులుగాక మరేవిటంటావ్?"

"కాళ్ళనుకో."

"కాళ్ళనుకోనా? ఖర్మం చాలక అలాగే అనుకొంటే తలక్రిందులుగా నడవ్వలసొస్తుందిరా బాబూ!"

వేళాకోళం కాదురా సూర్యం! నీవల్ల

ఒక ముఖ్యమైన పని జరగాలి" అన్నాడతను ప్రాధేయపూర్వకంగా.

"అరిదేవుడోయ్! ఏదో చుట్టబెట్టెయ్యాడాని కొచ్చినట్టున్నాడురా బాబోయ్!" అనుకొన్నాడు మనస్సులో సూర్యం.

"మా తమ్ముడి గురించి కాస్త చెప్పడానికి నీ వొకసారి మంత్రిగారింటికి వెళ్ళాలిరా! ఆయన నీకు బంధువు. నీమాట కాదనడు- బియ్యే ఫస్టు క్లాసులో పాసైకూడా వుద్యోగం దొరక్క మా వాడు నానా తిప్పలూ పడుతున్నాడు. వాడికీ సమయంలో సహాయం చేస్తే మేము జీవితంలో నీ మేలు మర్చిపోలేం ఏమంటావు."

గుటక పడని స్థితి వచ్చింది సూర్యానికి ఈ లేనిపోని బాజా అప్పుకోక తప్పదేమోనని ఓ ప్రక్క కంగారు. అయినా నెమ్మదిగా నసిగాడు.

"ఏమంటానికేంవుంది గాని అసలాయన వూళ్ళో లేడని విన్నాన్రా వెంకటేశం"

"వారం రోజులై వచ్చి యింటి దగ్గరే వున్నారట. మళ్ళీ రేపే హైదరాబాదు ప్రయాణముందట. యింతకు ముందే నాకూ ఈ వివరాలు తెలిశాయి. అంతట్లో మా సావిత్రి నీవిషయం గుర్తు చేసింది. నువ్వే గనుక పూనుకొంటే ఖచ్చితంగా ఏదో వుద్యోగం వేయించగలవని అదేపనిగా అంటున్నది సావిత్రి. నువ్వు వెళ్ళి నోరు తెరచి మంత్రిగార్ని అడిగితే నీమాట కామాత్రం విలువ యివ్వడంటావా!"

"ఎందు కివ్వడుగాని...."

"మరేం సందేహించకు సూర్యం! యివాళెలాగా సెలవు రోజే కదా! అంతా ప్రోగుజేస్తే ఎనిమిది మైళ్ళ ప్రయాణం. బస్సులో ఒక్క అరగంట కూర్చుంటే చాలు మంత్రిగారింటి ముందు దిగవచ్చు- నా మాట కాదనకురా నీకుపుణ్యముంటుంది'

రెండుకప్పుల్లో కాఫీకలుపుకొని వచ్చింది కమల. మొగుడివంక అదోలా చూస్తూ "అదుగోనండి అంతగా ప్రతిమాలించుకొంటాడు. ఫలానా పని నిమిత్తం యిల్లు కదలి మీరు వెళ్లాలేగాని - వెళ్తే కొండమీద కోతైనా దిగిరావడం తథ్యంకదా! అవతల మంత్రిగారి భార్యకూడా చాలా వుత్తమురాలని విన్నాను. తప్పక వెళ్ళిరండి' అని వెంకటేశంవైపు తిరిగి "వెళ్తాల్లెండి మరిదిగారూ ముందు కాఫీ తీసుకోండి" అంది.

"కాఫీ యిప్పుడెందుకు చెప్పండి వదినా! భోంచేసి యింకా పావుగంటైనా కాలేదు" అంటూ యిబ్బందిగా అందుకొన్నాడు వెంకటేశం.

భార్య మాటల్తో సూర్యానికి ఎక్కడలేని ఉక్రోషమూ పుట్టుకొచ్చింది. కోపంతో కాఫీ అందుకొని గటగటా త్రాగేశాడు. తాను వెంటనే బయల్దేరి మంత్రిగారింటికి వెళ్తున్నట్టుగా పౌరుషంకొద్దీ స్నేహితునికి వాగ్దానంచేసి అతన్ని పంపించి వేశాడు. ముఖం కందగడ్డలా చేసుకొని పది నిమిషాల్లోకల్లా ప్రయాణమై వీధి గుమ్మం దాటాడు.

ఇంట్లోంచి కమల అంది "సాయంత్రం భోజనానికి ఇంటికే వచ్చేయాలిసుమా! ఎదురు చూస్తుంటాను"–వెళ్తున్నవాడల్లా ఆగాడు సూర్యం. భార్యవంక చూడకుండా కాలర్ని మాత్రం స్టయిల్‌గా పైకెత్తి ముందుకు నడిచాడు - నవ్వుకొంది కమల–

మధ్యాహ్నం మూడు గంటలకల్లా మంత్రిగారి భవనం ముందున్నాడు సూర్యం-మంత్రిగారు సమయానికి ఇంటి దగ్గరే వున్నారు — సావిట్లో మెత్తని సోఫాలో కూర్చుని భారీ విగ్రహపుష్టిగల ఇద్దరు పెద్దల్తో ఏదో మాట్లాడుతున్నాడు.

లోనికి అడుగిడుతున్న సూర్యాన్ని చూడగానే నవ్వుతూ పలుకరించారాయన "ఓ... సూర్యం! చాలా కాలానికి కనపడ్డావే! ... రా!...యిలా కూర్చో-" అంటూ తన ప్రక్కనే చోటు చూపించాడు.

తిన్నగా వెళ్ళి కూర్చున్నాడు సూర్యం.

ఖుఃఖ్మని బయి వస క్షమమా
అన్నారాయన ఆప్యాయంగా.

తలూపాడు సూర్యం-

ఎదురుగా కూర్చునివున్న పెద్దలిద్దరూ మంత్రిగారి వద్దనుంచి శలవు తీసుకొని వెళ్ళిపోయారు.

సూర్యానికి మంత్రిగారు, చెప్పుకో దగ్గ దగ్గర బంధువేమీకాదు - పోనీ తగినంత పరిచయమున్నదా అంటే అదీ అంతంత మాత్రానిదే - కేవలం స్నేహితుని ముందు తనమాట చోటు పోతుందేమోనన్న మొగ మోటం వల్లనే యిప్పుడీ యిరకాటంలో పడాల్సొచ్చిందతను. ఆయన్తో తను వచ్చిన పని ఎలా చెప్పాలో నెమరు వేసుకుంటూ కూర్చున్న సూర్యాన్ని మంత్రిగారే పలుక రించారు. "యింటి దగ్గర అమ్మాయి ఏం చేస్తున్నది సూర్యం మర్చిపోయాను ఆమె పేరు ... కమల కదూ-"

"అవునండీ!"

"పిల్లలేమైనా కలిగారా లేదా?"

"అబ్బే! ఇంకా అదేంలేదండి" చిన్నగా నవ్వుతూ అన్నాడు సూర్యం.

మంత్రిగారు కొద్దిగా కదిలి "లే సూర్యం లోపలి కెడదాం యింట్లో మీ అత్తవుంది- అవునూ, ఆమెను నీవెప్పుడూ చూడలేదను కొంటాను. పద పరిచయం చేస్తాను."

సూర్యం ఆయన్ను వెంబడించాడు.

మంత్రిగారికి దాదాపు ముప్పై ఎనిమిది సంవత్సరాల వయస్సుంటుంది. మనిషి ఎత్తుకు తగ్గ పుష్టి గలిగి చాలా దర్జాగా కని పిస్తారు మంత్రి పదవిని చేపట్టనంత కాలం ఆయన బ్రహ్మచారిగానే గడిపారు. పద వితోపాటు వివాహమూ తప్పనిసరి కావ డంతో తన ముప్పై అయిదవ ఏట లక్ష ణంగా ఆయన వివాహం చేసుకొన్నారు. పిల్ల నిచ్చిన వారు కోట్లకు పడగలెత్తిన వారని వినికిడి.

ముఖ్యంగా మంత్రిగారిలో ప్రతి వొక్కరూ కొనియాడదగ్గ ప్రత్యేకసామ ర్థ్యం ఒకటుంది. ఒక్కసారి పరిచయమైన వ్యక్తి మళ్ళీ ఎప్పుడు ఎక్కడ కన్పించినా



పేరుపెట్టి పల్కరించడంలో ఆయనకు మరె వరూ సాటిరారు.

గదిలోకి అడుగుపెట్టారు మంత్రిగారు.

అది చక్కగా అలంకరించి వున్న ఎయిర్ కండిషన్ రూము: దాని మధ్య ఒక రౌండు టేబిలు ఆ చుట్టూ నాలుగు కుర్చీలు ఓ కుర్చీలో ఠీవిగా కాలుమీద కాలు వేసు కొని ఏదో సినిమా పత్రిక చదువుతూ కూర్చుని వుందామె - యిరవై సంవత్స రాలైనా పూర్తిగా నిండివుండని వయస్సు.

మంత్రిగారి వెంట మరొక అపరిచిత వ్యక్తి వచ్చినా ఆమె దృష్టిని యిటు మరల్చ లేదు.

మంత్రిగారే పలుకరించారు. "చూడు సుశీ! యితను మనకు బంధువు - వర సకు మేనల్లుడవుతాడు."

"ఓహో! అలాగా!" అంటూ ఆమె తలెత్తి సూర్యాన్నొకసారి చూసి వెంటనే మళ్ళీ పుస్తకం చదవడంలో నిమగ్న మైంది.

పెద్ద అందంగా లేకపోయినా అలంక రించుకొన్న తీరు బాగుందనుకొన్నాడు సూర్యం.

"మీ అత్తకు పుస్తకాలన్నా సినిమా లన్నా మహాచెడ్డ యిష్టమనుకో సూర్యం- అరె! అలా నిల్చునే వుండిపోయావేం- యిలా వచ్చి కూర్చో!"

యిబ్బందిగా కూర్చున్నాడు సూర్యం —

"కాఫీలు తెప్పించు సుశీ" అన్నారాయన కాస్త నెమ్మదైన స్వరంతో. విసుగ్గా తలెత్తిందామె.

"అనంతా" అని పిల్చింది గుమ్మంవంక చూస్తూ. గడపదాటి గబగబా ఆమె దగ్గర కొచ్చి నిల్చున్నాడొక యువకుడు ఆమె ఆజ్ఞకోసం.

"పాతికేళ్ళ వయస్సు — పచ్చని శరీర చ్ఛాయ! ముచ్చటగొలిపే ముఖవర్చస్సు — 'మగాళ్ళలో కూడా ఇంతటి అందగాళ్ళుంటారా' అనుకొన్నాడు సూర్యం అతన్నాశ్చర్యంగా చూస్తూ —

"మూడు కాఫీలు" అందామె.

వెళ్ళి నౌకరుచే మూడు కాఫీలు పట్టించుకొని వచ్చాడతను. కాఫీలు త్రాగడమెం తర్వాత కాళీ కప్పుల్తో నౌకరూ, ఆవెనక అనంతుడూ బయటికి వెళ్ళిపోయారు.

సిగరెట్టు ముట్టిస్తూ తాపీగా ప్రశ్నించారు మంత్రిగారు. "సంగతేమిటి సూర్యం! నాతో యేమైనా పనుండి వచ్చావా?"

"ఒక ఉద్యోగం నిమిత్తం నా ఫ్రెండ్ పంపగా వచ్చాను".

"ఓహో! ఉద్యోగపు బంధువులన్నమాట" తపీమని అంది సుశీల. తెల్లబోయాడు సూర్యం.

చేతిలోని పుస్తకాన్ని టేబిల్‌పై పడవేసి ఆవలిస్తూ వొళ్ళు విరుకొచుందామె. పైట పూర్తిగా ప్రక్కకు తొలగడంవల్ల బిగువైన ఆమె పరువంపై పడిన దృష్టిని కష్టంమీద మరోవైపుకు మరల్చుకొన్నాడు సూర్యం.

ఆమె ముఖం చిట్లించుకొంది. చాలా కోపంగా అంది- "దేశంలో ఎక్కడ చూసినా నిరుద్యోగమన్న గోలే ఎక్కువైపోయింది. వీళ్ళు చదివే చదువులన్నీ వుద్యోగాలు చేయడానికితప్ప మరెందుకూ పనికిరావుగాబోలు. మనమట్టూ కావలసినంత వ్యవసాయపు భూమి వుంది! ఎన్నో లఘు పరిశ్రమలున్నాయి. వాట అభివృద్ధి జాలతం పోవడానికెవ్వడూ యిష్టపడడుగాని ఒక్క వుద్యోగానికి కాళీ వున్నట్టు తెలిస్తే వేలాది అభ్యర్థులు మూగుతారు. పెద్దపెద్దరికమందే షన్లకోసం ప్రాకులాటకి పూరికే ఎగబడతారు."

తారెత్తిపోయాడు సూర్యం — తలెత్తడానిక్కూడా అతనికి ధైర్యం చాలలేదు.

మంత్రి గారిక్కూ తప్పలేదు "అవును సూర్యం! మొన్న కృష్ణారావు బాబాయ్- ఎమ్మే చదివిన తన కొడుకుని వెంటబెట్టుకొని వచ్చాడు నాదగ్గరకి. వుద్యోగమంటే లాభం లేదు బాబాయి- కావలిస్తే పదెకరాల బంజరు భూమికి పటా వచ్చే ఏర్పాటు చేస్తాను. అన్నాను! అదే మహాప్రసాదంలా అంగీకరించారు వాళ్ళు...!"

"అనంతా" అని పిల్చి ఆమె మళ్ళీ గుమ్మం వైపు దృష్టి సారించింది.

అతను లోని కొచాడు.

"డ్రైవర్ని కారు సిద్ధం చేయమను సినిమా కెళ్ళాలి" అతను వెళ్ళాడు.

భర్తతో సుశీల అంది "నేను సినిమా కెళ్తున్నా అనంతుడు నావెంటవుంటాడు."

మంత్రిగారు సరే ననలేదు, కాదనీ అనలేదు.

ఆమె ఠీవిగా అతి వయ్యారంగా నడచి వెళ్ళిపోతుంటే ఖిన్నుడై చూస్తూ వుండిపోయారాయన. సూర్యం నెమ్మదిగా అన్నాడు. "మీరు గౌరవనీయమైన పదవిలో వున్నారు — మీరు తల్చుకొంటే మా ఫ్రెండ్‌కి మేలు జరగకపోదు."

బరువుగా నవ్వారు మంత్రిగారు. "పదవి ... పదవి చాలా గౌరవమైందే సూర్యం — చూస్తున్నావుగా పరిస్థితులే బొత్తిగా అపసవ్యంగా వుంటున్నాయి.... సరేగాని — ఆరింటికల్లా భోజనంచేసే అలవాటునాది వేళైంది పద! భోజనం చేద్దాం." అన్నారాయన పడిపోయిన వుత్సాహాన్ని పైకి లాక్కుంటూ,

"వద్దండీ! భోజనానికి యింటికే వెళ్ళి

పోతాను. అవతల కమల నాకోసం ఎదురు చూస్తూ కూర్చునుంటుంది."

"నాకు తెలుసు సూర్యం! నువ్వు చాల అదృష్టవంతుడివి. కాకపోతే ఈ నౌకర్లు వడ్డించే వంట నీ కెక్కడ రుచింపుతుంది. సరే మరి నీ యిష్టం–" చీకటి పడ్తున్న వేళ చిన్నబోయిన ముఖంతో యింట్లో అడుగుపెటాడు సూర్యం. తిన్నగావచ్చి కుర్చీలో కూలబడి తదేకంగా ఎటో చూస్తూ ఆలోచనల్లో మునిగిపోయాడు.

ముఖం చూడగానే భర్త వాలకాన్ని పూర్తిగా పసిగట్టేసింది కమల—చప్పుడు కాకుండా వెళ్ళి కుర్చీ ప్రక్కన నేలపై చతికిలపడి మౌనంగా అతని కాళ్ళు పట్ట సాగింది.

అయిదు నిమిషాల అనంతరం బుజ్జగింపు ధోరణిలో అంది పెద్దమనుషుల్తో వ్యవహారానికి వెళ్ళినప్పుడు పరిస్థితులన్నీ మనకనుకూలంగానే వుంటాయేమిటండీ! ఈమాత్రానికే ఎందుకంతగా ఆలోచించడం?"

"అబ్బే! అదేంలేదు కమలా! వెళ్ళిన పని బాగానే అయింది. మంత్రిగారే కాదు-ఆయన భార్యకూడా నన్నెంతో గౌరవించిందనుకో–"

పరిశీలనగా చూసింది కమల సూర్యం ముఖంలోకి—"అయితే భోజనం కూడా అక్కడే చేశారా?" అడిగింది కొస్త స్వరం పెంచి.

"ఊఁ...." అన్నాడు సూర్యం గత్యంతరంలేక-చివ్వున లేచి నిల్చుని కఠోరంగా ఆదేశించింది కమల.

"ముందా కుర్చీలోంచి లేవండి"

గభాలున లేచి నిల్చున్నాడు సూర్యం

"వెళ్ళండి! దొడ్లో నూతిదగ్గర కెళ్ళి కాళ్లు కడుక్కుని రండి!"

"నేనా? ఆ చీకట్లోకి వెళ్ళి కాళ్లు కడుక్కొని రానా? యిదేవిటే ఎన్నడూ లేని విపరీతం!"

"ఏమీ విపరీతంకాదు. ఉదయాన్నుంచీ మీరాడుతున్న అబద్ధాలకిదే శిక్ష మీకు—వెళ్ళండి–! భోజనం విషయంలో మాత్రం నన్ను మీరెన్నడూ మాయజెయ్యలేరు–"

తటాలున తలెత్తి భార్య ముఖంవంక చూశాడు సూర్యం. వెంటనే మళ్ళీ తల వొంచుకొని నెమ్మదిగా దొడ్డి మెట్లపైపు నడక సాగించాడు.

కంగారుగా గదిలోకి పరుగు పెట్టింది కమల- లైటు తీసుకువచ్చి భర్తకు దారి చూపాలన్న తాపత్రయంతో. ★




సంపూర్ణ ఆరోగ్యంపొందండి

నరముల బలహీనతకు, శుక్ల నష్టమునకు, శీఘ్ర స్ఖలనమునకు, ప్రత్యేక ముఖవ్యాధులకు చికిత్స చేయబడును.

పెండ్లిముందు-పెండ్లితర్వాతసంప్రదించండి

డా॥ రాయ్ గుప్త రోగముల నివారణ నిపుణులు.

[గవర్నమెంటు రిజిష్టర్డు]

గాంధీనగరం-అలంకార్ టాకీస్ ఎదుట-విజయవాడ-3. ఫోన్ : 74658

సంప్రదించువేళలు : ఉ॥ 8 నుండి రాత్రి 9-30 వరకు

[ఆదివారం ఆస్పత్రి పనిచేయును]